# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 19-12-2016**

గత రెండున్నర దశాబ్దాల కాలంలో రాష్ట్రంలో నయీం ముఠా దారుణమైన నేర చర్యలకు పాల్పడింది. భువనగిరి కేంద్రంగా ప్రారంభమైన ఈ ముఠా కార్యకలాపాలు క్రమంగా రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాయి. నయీం అరాచకాలకు ఎంతో మంది బలైపోయారు. ప్రజలు భయం గుప్పిట్లో బ్రతకాల్సిన పరిస్థితులు దాపురించాయి. గత ప్రభుత్వాల పరిపాలనలో నయీం యథేచ్ఛగా తన నేర చర్యలు కొనసాగించాడు. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎంతో మంది నయీం బాధితులు న్యాయం చేయమని మొరపెట్టుకున్నారు. దీంతో తీవ్రమైన అసాంఘిక శక్తిగా మారిన నయీం ముఠాను కఠినంగా అణచివేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ దిశగా చర్యలు చేపట్టవలసిందిగా పోలీసులను ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసు శాఖ నయీం కదలికల మీద నిరంతర నిఘా పెట్టింది. గత ఆగస్టు 8వ తేదీన నయీం ముఠా షాద్ నగర్ లోని మిలీనియం టౌన్ షిప్ పరిసర ప్రాంతంలో మారణాయుధాలతో సంచరిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అరెస్టు చేయడానికి ప్రయత్నించారు. ఆ సందర్భంలో జరిగిన ఎదురు కాల్పుల్లో నయీం హతమయ్యాడు. సంఘటనా స్థలంలో పోలీసులకు ఒక ఎకె 47 రైఫిల్ తో పాటు, 9 ఎంఎం పిస్టల్, మందుగుండు సామాగ్రి లభించింది.

నయీం నేర చర్యలకున్న విస్తృతిని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం పూర్తి స్థాయి దర్యాప్తు కోసం పత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్ ను) నియమించింది. దర్యాప్తు సమర్థవంతంగా జరగాలని సిట్ నేతృత్వంలో నాలుగు బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. నయీం మరణంతో బాధితుల్లో భయం తొలగిపోయి, ప్రభుత్వంపై భరోసా ఏర్పడి సిట్ కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఫిర్యాదుల ఆధారంగా 174 కేసులు నమోదయ్యాయి. 741 మంది సాక్షులను పోలీసులు విచారించారు. 124 మంది నిందితులను అరెస్టు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నయీం ముఠాకు చెందిన స్థావరాలలో పోలీసుల జరిపిన సోదాలలో 21 తుపాకులు, 21 కార్లు, 26 మోటారు సైకిళ్లు, 2 కోట్ల 95 లక్షల 9 వేల 80 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. నయీం బంధు మిత్రుల పేరు మీద రిజిష్టర్ చేయబడిన దాదాపు 1,015 ఎకరాల భూమికి సంబంధించిన పత్రాలను, ఒక లక్షా 67 చదరపు గజాల విస్తీర్ణం కలిగిన ఇండ్ల స్థలాలకు సంబంధించిన ఆస్తి పత్రాలను, 27 గృహాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆస్తుల మొత్తం రిజిస్ట్రేషన్ విలువ 143 కోట్ల 94 లక్షల 5 వేల 198

రూపాయలు. 27 హత్య కేసుల్లో ఇప్పటికే నయీం ముఠా పాత్రను గుర్తించి ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేశారు. మరో 25 హత్యలకు నయీం ముఠా పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. చాలా తక్కువ వ్యవధిలో పోలీసులు నయీం ముఠా పాల్పడిన నేరాలకు సంబంధించిన అనేక వివరాలను, ఆధారాలను ఇప్పటికే సేకరించారు. రెండు చార్జిషీట్లు కోర్టులో దాఖలు చేశారు. మరో 15 చార్జిషీట్లు తయారయ్యాయి. త్వరలోనే వాటినీ విచారణ నిమిత్తం కోర్టుకు సమర్పించనున్నారు. అయితే, నయీం ముఠా సాగించిన నేరాల విస్తృతి రీత్యా ఇంకా దర్యాప్తు కొనసాగుతున్నది.

తన అకృత్యాలతో ప్రజల్ని వేధించిన నయీం ముఠా అంతమొందడంతో ప్రజలు ప్రశాంతంగా ఊపిరి పీల్చుకున్నారు. ప్రభుత్వం ఇటువంటి అరాచక శక్తులను అణచివేయడంలో ప్రదర్శిస్తున్న కఠిన వైఖరిని ప్రజలు అభినందిస్తున్నారు. నయీం విషయంలో పోలీసులు ప్రదర్శించిన సమర్ధతను ప్రభుత్వం అభినందిస్తున్నది.

**సిపిఆర్ఓ టు సిఎం**